

సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

శుక్రవారం,18 ఏప్రిల్ 2025

8

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా


# ఏప్రియల్ నెల థీమ్.. ఈ వేస్ట్ మేనేజ్మెంట్

- 4వ విడత “స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర” – “ఎలక్ట్రానిక్ వ్యర్థాలకు చెక్”
- వార్డు, గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించాలి – జిల్లా కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన”స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం”నకు సంబంధించి ప్రతి నెల 3వ శనివారము – స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను ప్రజా ప్రతినిధుల ,ప్రజల భాగస్వామ్యం పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులకి ఎస్ఎఎస్ఎ కార్యక్రమం చేపట్టడంపై మునిసిపల్ కమిషనర్ కేతన గార్గ్‌తో కలిసి కలెక్టర్ సూచనలు చెయ్యడం జరిగింది.ప్రజలందరికీ తెలిసే విధంగా టాంటాం మరియు మైక్ అనౌన్స్మెంట్‌లు చేయించి శనివారం రోజున ఏఏ కార్యక్రమాలు ఏ ప్రదేశాలలో జరుగునో స్థానిక ప్రజాప్రతినిధులకీ తెలియజేసి ప్రజలందరి భాగస్వామ్యంతో అందరూ పాల్గొనేలాగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్‌పి.ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, సంస్థలలో నిరుపయోగంగా ఉన్న ఎలెక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటిని ఉపయోగం లోనికి తీసుకొని రావడంపై దృష్టి సారించడం, వాటిని సమూహ పరచడం చేయాలన్నారు.ఇందు కోసం జిల్లాలో ఈ వేస్ట్ స్టాల్స్ ద్వారాఈవేస్ట్‌ను సేకరణ చేస్తున్నట్లు ప్రజలందరికీ విస్తృత స్థాయిలో ప్రచారం చెయ్యాలని పేర్కొన్నారు.ప్రతి గ్రామ పంచాయతీలో, మునిసిపల్ వార్డులలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ఏప్రిల్ నెల థీమ్‌పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించవలెననీ స్పష్టం చేశారు. కార్యాలయాలను పూర్తి స్థాయిలో పరిశుభ్రం చేయాల్సి ఉందన్నారు. కంప్యూటర్ సిస్టమ్స్, ప్రింటర్లు, స్కానర్లు, ఇతర మౌలిక సదుపాయాలు శుభ్రం చేయడం,టేబుల్స్,ర్యాక్స్ తదితరాలు చక్కగా తీర్చి దిద్దుకోవాలన్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కియోస్కో స్టాల్స్ ఏర్పాటు ఆయా ప్రాంతాల్లో ఎలెక్ట్రానిక్ వ్యర్థాలు ఒకచోట సేకరించ వలసి ఉంటుందన్నారు. అన్ని మేజర్‌పంచాయతీల్లో,మండల ప్రధాన కార్యాలయాలలో కార్యాలయాలు, సంస్థలు ప్రజల నుండి ఈ వేస్ట్ సేకరించవలసి ఉంటుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు,ఈవేస్ట్ జనరేట్ చేసే సంస్థలు మరియుప్రజలు అందరూఈకార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని, అవగాహన పెంచుకోవడమే కాకుండా,సరియైన విధానంలో ఈ వేస్ట్ వ్యర్థాలను సరియైన విధానంలో పారవెయ్యడం తమ బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణకై కృషి చెయ్యడం, అందుకు అనుగుణంగా ప్రచార కార్యక్రమాలను, ప్రజల్లోచైతన్యం కలిగించే ప్రదర్శనలు ద్వారా అందరికీ అవగాహన కల్పించవలెను. అందులో భాగంగానే ఈవేస్ట్ వల్ల ఆరోగ్యం మరియు పర్యావరణానికి కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏదో మొక్కుబడిగా కాకుండా ఒక ఉద్యమ స్ఫూర్తితో కూడిన ఈ వేస్ట్‌కు సంబంధించిన ప్రతి జిపిలలో, అవగాహన ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞకార్యక్రమాలు నిర్వహించవలెననీ మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు.జిల్లాలో గుర్తించిన ఈవేస్ట్ స్క్రాప్ డీలర్లు ద్వారా ఈ వ్యర్థాలు సరియైన విధానంలో పారవేయడం (నిర్మూలన) చర్యలు తీసుకొనడం చర్యలను చేపట్టాల్సి ఉందన్నారు.

# ఏప్రిల్ 20న రామచంద్రపురంలో మెగా ఉచిత వైద్య శిబిరం



- ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులుచే వైద్య పరీక్షలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్** : స్వర్ణాంధ్ర విజన్–2047 సాధకులు, నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బాబు నాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని మీ ఆరోగ్యం– మా బాధ్యత అనే నినాదంతో “సత్యం వాసంశెట్టి ఫౌండేషన్” ఆధ్వర్యంలో ఈనెల ఏప్రిల్ 20న ఉదయం 9గంటలకు రామచంద్రపురం విఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలఆవరణలో మెగా ఉచితవైద్యశిబిరం నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.

ఈఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులైన అపోలో, మెడీ కవర్, మెడ్ వే సంజీవని, అగర్వాల్ కంటి ఆసుపత్రి తదితర ఆసుపత్రుల నుంచి వైద్యులు పాల్గొని ఉచిత వైద్య సేవలు, ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులతో పాటు,ముఖ్యంగా గుండెసంబంధిత వ్యాధులకు, స్త్రీల (గైనిక్) సమస్యలకు నిపుణులచే

- తరువాయి 2లో..

# జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పొన్నాడ సతీష్, కుడిపూడి





**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నియమితులైన విషయం తెలిసిందే.ఈసందర్భంగా ఆయనను ముమ్మిడివరం ఇంచార్జ్ పొన్నాడ సతీష్,ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి, జిల్లాలోని పలువురు జడ్పిటిసిలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు,అభిమానులు గోపాలపురం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహానికి చేరుకుని పూలమాలలు సాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారంఅమరావతి సచివాలయం సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ..జిల్లా ఎస్పీ బిందు మాధవ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు.ఉచిత ఇసుక సరఫరా,సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్‌కు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక,త్రాగునీటి సరఫరా, ఎంఎస్ ఎమ్ఈల సర్వే, నియోజక వర్గాలలో ఎంఎస్ఎమ్ఈ పార్కుల ఏర్పాటు,స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ కె.విజయా నంద్ చర్చించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు,ఏపీఈపీడీసీఎల్ ఈఈజి.ప్రసాద్, ఇతరశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో నూతన సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన



**రాజానగరం,మేజర్‌న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నూతన సబ్ స్టేషన్ ను స్థానిక ఎమ్మెల్యే భక్తుల బలరామకృష్ణ, వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం బిజెపి ఇంచార్జ్‌నీరుకొండ వీరన్న చౌదరి, సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.తిలక్ హాజరై భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రూ. 2.66 కోట్లు అంచనా వ్యయంతో 33/11 విద్యుత్తు సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశామని, రాజానగరం పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయాన్ని నిర్మూలించేందుకు ఇదిఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో విద్యుత్ అంతరాగాలను నిర్మూలించేం దుకు ఎంతో కృషి చేస్తున్నామని దీనిలో భాగంగా రాజానగరం నియోజక వర్గ చరిత్రలో ఒకేసారి నాలుగు సబ్ స్టేషన్లు తీసుకువచ్చామన్నారు. నియోజకవర్గానికి సబ్ స్టేషన్లు మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మరియు ఎనర్జీ మినిస్టర్, శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే ఆరు నెలల్లో రాజానగరం నియోజకవర్గంలో ఎక్కడ విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఆదికవి నన్నయ విశ్వవి ద్యాలయంలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించిన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీకి ధన్యవాదాలు తెలిపారు. ఆమె ఎంతో హానెస్ట్‌గా పని చేస్తున్నారని, విశ్వవిద్యాల అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో శంకుస్థాపన చేస్తున్న సబ్ స్టేషన్ పనులు రెండు నెలల్లో పూర్తి కావాలని ఎలక్ట్రికల్ అధికారులకు కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని దీనికి సహకరిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మరియు నాయకులకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎక్కువ అనుబంధ కళాశాలలతో రాష్ట్రంలోని అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉందని అన్నారు.

సొంత సొమ్ముతో స్థలాన్ని కొనుగోలు చేశారని, మరికొంత స్థలం ప్రభుత్వం నుండి రావాల్సి ఉందని, దానికి సహకరించి విశ్వవిద్యాలయ ప్రాంగణాల విస్తరణకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాజానగరం ప్రజలకు సబ్‌స్టేషన్ నిర్మాణానికి విశ్వవిద్యాలయం స్థలం కేటాయించి భాగస్వామ్యం అయిందని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి నాయకులు సహకరించి భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా విశ్వవిద్యాలయానికి ప్రత్యేకలైన్ కేటాయిస్తారని విశ్వ విద్యాలయంలో విద్యుత్ అంతరాయాలు కూడా ఇకపై తొలగిపోతాయని అన్నారు.

రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం బిజెపి ఇంచార్జ్ నీరుకొండ వీరన్న చౌదరిలు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో నడుస్తుందని ప్రశంసించారు. రాజానగరం నియోజ కవర్గంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా నాలుగు సబ్ స్టేషన్లు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు దక్కుతుందని అభినందించారు. అనంతరం అతిథులను సాలువలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, విద్యుత్ శాఖ అధికారులు ఎస్.ఇ.కె తిలక్ కుమార్, రాజమహేంద్రవరం రూరల్ ఆపరేషన్స్ ఇ.ఇ. శ్రీధర్ వర్మ, ఇ.ఇ.ఎం రవికుమార్, ఇ.ఇ. వై డేవిడ్, డి.ఇ. సన్యాసిరావు, ఏ.ఇ. సుధాకర్, ఎంపీడీవో ఝాన్సీ, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ల నిరసన




**అల్లవరం, మేజర్‌న్యూస్ :** బెండమూర్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు వారి హక్కులకోసం నిరసన తెలియజేసారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగం అయిన తమని రెగ్యులర్ చెయ్యాలి అని, పెండింగ్‌లో వున్న ఇన్సెంటివ్‌లను విడుదల చెయ్యాలి అని, తమకు ఉద్యోగభద్రత కల్పించాలి అని, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులతో సమానంగ ఈపీఎఫ్ఓను పునరుద్ధించాలి అని ప్రభుత్వానికి విన్నావించుకున్నారు. ఇది మా నిరసన కాదు అని,6 సంవత్సరాల నుండి మా ఆవేదన అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నాటు సారా స్వాధీనం - ముగ్గురు అరెస్టు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ఉత్తర ఎక్సైజ్ డిపార్ట్మెంట్ నిర్వహించిన దాడుల్లో నాటు సారాను, 400 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజర పరిచినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ తెలిపారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్య మురళి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లుగా సీఐ తెలిపారు. సామర్లకోటకు చెందిన కోశెట్టి వరలక్ష్మి, మాదమని సత్యవతి, కాళ్ళ సరోజ వద్దనుండి నాటు సారా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లుగా సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఎం.వి.వి.ఎస్.కుమార్, బి.ఎన్.ఎస్. వరహాలు, నరసింహారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థను సద్వినియోగం చేసుకోవాలి

**భీమడోలు,మేజర్‌న్యూస్ :** మహిళా రైతులను ప్రోత్సహించేందుకు పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గ నైజేషన్ సేవలను వినియోగించుకోవాలని, వెలుగు భీమడోలు ఎపిఎం .కె.రత్న కుమారి కోరారు ఈ మేరకు మండల పరిధిలో 15మంది సభ్యులుగా గల ఒక కమిటీని నియమించారు.వీరిలో ముగ్గురు డైరెక్టర్లగా వ్యవహరించనున్నారు. వీరి ఆధ్వర్యంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపుల నియామకం జరుగుతుంది. ఒక్కొక్క గ్రూపులో. పది నుంచి 12 మంది వరకు సభ్యులు ఉంటారు. మండల వ్యాప్తంగా ఈ తరహాలో 100 గ్రూపుల.స్థాపన లక్ష్యం కాగా,ఇంతవరకు 80 గ్రూపుల నియామకాలు పూర్తయ్యాయి. విధివిధానాలు తెలియజేయడంతో పాటు ,ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసంభీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం తొలిసారిగా ఎపిఎం.అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎపిఎం. మాట్లాడుతూ, మండల స్థాయిలో కార్యవర్గ ఏర్పాటు కోసం మేజర్ పంచాయితీల నుంచి ఇద్దరూ, మైనర్ పంచాయతీల నుంచి ఒకరిని సభ్యులుగా ఎంపిక చేసామన్నారు. తాజాగా భీమడోలు మండలానికి కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.5 లక్షల రివాల్వింగ్ మంజూరయ్యిందన్నారు.

కమిటీ సమావేశంలో వ్యవసాయం చేసే మహిళా రైతుల అవసరాలను గుర్తించి మంజూరైన రివాల్వింగ్ పండు నుంచి లక్ష రూపాయల వరకు రుణాలను అందజేస్తారన్నారు. సకాలంలో వీరు వడ్డీతో సహా చెల్లించిన తరువాత సదరు మొత్తాలను త్రిఫ్ట్ ఖాతాలుగా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అవసరం ఉన్న మరొకమహిళ రైతులకు రుణాలుగా ఇస్తామన్నారు. ఈ తరహాలో ప్రభుత్వం రానున్నకాలంలోమరింతగా రివాల్వింగ్ ఫండ్ విడుదల చేయనుందన్నారు.

ఈతరహాగా జమఅయినమొత్తాలతో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల కొనుగోలు, అద్దెలకు తెచ్చుకునేందుకు రుణాలుగా అందజేస్తారన్నారు.

## ఏప్రిల్ 20న రామచంద్రపురంలో మెగా ఉచిత వైద్య శిబిరం

మొదటిపేజి తరువాయి

వైద్య పరీక్షలు నిర్వహిస్తారుఅన్నారు. ఈవైద్య శిబిరంలో ఈసీజీ,టుడి ఎకో,బిపి,షుగర్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఏప్రిల్ 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈఉచిత వైద్యశిబిరం జరుగుతుందని మంత్రి సుభాష్ తెలిపారు. రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నవ్యాంధ్ర ప్రదేశ్ కు ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం సందర్భంగాపలుసేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్టు మంత్రి సుభాష్ ఈసందర్భంగా తెలిపారు.

## ఎంబర్ మన్నారు స్వామి దేవాలయంలో నృత్యనీకేతన్

**నరసాపురం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఎంబర్ మన్నారు స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం ఆదిపరాశక్తి నృత్య నీకెతన్ వలవల అనంత˘లక్ష్మి దేవి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు చేసిన ఈ ప్రదర్శన భక్తుల ను అలరించింది. కార్యక్రమాలను వంశపారంపర్య ధర్మకర్త, ఈవో తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

## వక్ఫ్ బిల్లు సవాలు చేస్తూ కోర్టులో వైసిపి పిటిషన్ పట్ల హర్షం

### మాజీ సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

**కైకలూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో మార్పులు చేసేందుకై లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లును సవాలు చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి,సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై కైకలూరు నియోజకవర్గ మైనారిటీ సోదరులు హర్షం వ్యక్తం చేసినారు. చేస్తూ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, దూలం నాగేశ్వ రరావు ఆధ్వర్యంలో,కైకలూరు ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాల యంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. వీరితోపాటు రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్,నియోజకవర్గ మైనారిటీ విభాగ అధ్యక్షులు మహమ్మద్ గాలిబ్ బాబు, సోమాల శ్యాంసుం దర్, షేక్ రఫీ, తోట మహేష్,,అబ్దుల్ మాలిక్(మున్నా),ఫిర్దోజ్ ఖాన్, అమీర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భారత్ దళిత సేన జాతీయ కార్యదర్శిగా డా.అలుగు అనంద శేఖర్

### జాతీయ అధ్యక్షుడు డా.స్వామి వెల్లడి

**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:**భారత్ దళిత సేన(బీడీఎస్) జాతీయ కమిటీకార్యదర్శిగా ప్రముఖ విద్యావేత్త డా.అలుగు ఆనంద శేఖర్ నియమితులైనట్టు బిడిఎస్ జాతీయ అధ్యక్షుడు డా.బి.స్వామిప్రకటించారు.గురువారం డా.స్వామి జంగారెడ్డి గూడెం పర్యటన సందర్బంగా ఇక్కడి 'అలుగు' కార్యాలయంలో తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు.ఆనందశేఖర్ వంటి విజ్ఞులు, మేధావులు ప్రజాసమస్యలపై స్పందించాలని అన్నారు. మేధావుల మౌనం సమాజానికి నష్టం అని పేర్కొన్నారు.జనహితం కోరే ఎందరో పెద్దలు ప్రముఖులు ఏ కారణంగా నైతేనే మౌనంగా వుంటున్నారని అన్నారు.నేడు దేశంలోను,రాష్ట్రంలోను దళితులు అనేక అవమానాలు, నిర్బంధాలు ఎదుర్కొంటున్నారని,దీనిని తమ సంఘం సీరియస్‌గా తీసుకొంటున్నదని స్వామిస్పష్టం చేశారు. త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయకార్యవర్గ సమావేశంలో తమ విధానాలు కార్యాచరణ తెలియజేస్తాం అని చెప్పారు.ఈ సందర్బం గా జాతీయ కమిటీకార్యదర్శిగా నియమితులైన డా.అలుగు అనం దశేఖర్‌కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అలుగును స్వామి ఘనంగా దుస్సాలువతో సత్కరించారు. ఢిల్లీలో జరగనున్న జాతీయ సమావేశంలో చర్చించవలసిన అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు అలుగు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# మరుగున పడ్డ కానూరు మురుగుడ్రైన్‌కు మోక్షం

**– రైతుల భాగస్వామ్యంతో గుర్రపుడెక్క తొలగింపుకు యత్నం**
**– ఎస్టిమేషన్లు రెడీ.. డ్రైన్స్ ఏఈ వివేక్**



**పెరవలి,మేజర్‌న్యూస్ :** గత ఐదు సంవత్సరాలుగా పూడికతీత లేక మరుగున పడ్డ కానూరు మురుగుడ్రైన్ కు మోక్షం కలిగింది డ్రైన్ ఆయకట్టులోని రైతుల భాగస్వామ్యంతో గుర్రపుడెక్క తొలగింపు కు రసాయనాలు పిచికారి చేయిస్తూ రైతులు పూడికతీత పనులు మొదలుపెట్టారు. 3500 ఎకరాల ఆయకట్టు భారీ వర్షాల సమయంలో నీటిముంపు గురికాకుండా ఉండటానికి మురుగునీరు వెళ్లే ప్రధాన డ్రైన్ కావడంతో రైతులు సమిష్టిగా ఈ పనులు మొదలుపెట్టి బిల్లుల కోసం కూటమి ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటు అయిన నీటిసంఘాలవైపు చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు గ్రామంలో ప్రవహించే కానూరు డ్రైన్ పెండ్యాల దానమ్మ తల్లి గుడి వద్ద నుండి ప్రారంభం అయి 5 కిలోమీటర్ల పొడువు ఉండే ఈ డ్రైన్ 5 గ్రామాల కు చెందిన రైతుల ఆయకట్టు నుండి వచ్చే మురుగు నేటితో దమ్మేను వద్ద అండర్ తన్నెల్ ద్వారా గోస్తనీకాలంలో కలుస్తుంది. ఈ డ్రైన్ వైసిపి ప్రభుత్వ పాలనలో గత ఐదు సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో రైతులు చాలా నష్టపోయారు. కూటమి ప్రభుత్వంలో రైతు సంఘాలను ఏర్పాటు చేయటం రైతుల భాగస్వామ్యంతో మురుగునీటి కాలువలను శుభ్రపరిచే ప్రక్రియలు మొదలు కావడంతో ఈ డ్రైన్ ఆయకట్టుకు సంబంధించిన రైతులు సాయిబాబా ఆక్వా సంఘం తరపున ఆక్వా రైతులు చందాలు వేసుకుని ఈడ్రైన్ శుభ్రపరుస్తున్నామని కానూరు గ్రామానికి చెందిన ఆక్వా రైతు అనపర్తి సాంబమూర్తి ఏప్రిల్ 17వ తేదీ గురువారం మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ విషయంపై మేజర్ న్యూస్ డ్రైన్స్ ఏఈ వివేక్‌ను అడుగగా ఉడికితీతకు సంబంధించిన ఎస్టిమేషన్ల తయారు చేసాము అని రైతులు సంయుక్త భాగస్వామ్యంతో ఈపనులు చేసుకుంటే నీటిసంఘాల ద్వారా బిల్లు వచ్చిన వెంటనే వారికి ఖర్చు అయిన మొత్తం చెల్లిస్తామని అన్నారు. ఈమేజర్ డ్రైన్‌ను శుభ్రపరిచి తమ పంటచేలు చెరువులు కాకుండా ఉండేందుకు రైతులు మొదలుపెట్టిన ఈప్రయత్నం అభినందనీయం అన్నారు. ఈ సమస్యను పెండ్యాల పంపింగ్ స్కీం నీటి సంఘం ప్రెసిడెంట్ పుల్లా ఆదిశేఖర్ కు తెలియజేశామని ఆయన తెలియజేశారు. అయితే ప్రభుత్వం వారు నిధులు మంజూరు చేసి ఈ పని మొదలుపెట్టే సమయానికి భారీ వర్షాలు వస్తే కోతకు వచ్చిన వరిచేలు మునిగి విపరీతమైన పంట నష్టం వచ్చే అవకాశం ఉందని కావున ఈ వెంటనే ఈ పనులు మొదలు పెట్టమని రైతులు మేజర్ న్యూస్‌కు తెలియజేశారు. ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు బిల్లు వచ్చిన తర్వాత చెల్లిస్తానని నీటి సంఘం అధ్యక్షులు అధికారులు హామీ మేరకు తమ రైతులందరూ ఉమ్మడిగా ఈ డ్రైన్ మరమ్మతులు ప్రారంభించామని కావున వెంటనే అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని అనపర్తి సాంబమూర్తి కోరారు. ఇప్పుడు తూడు, కలుపు నివారణకు మందులు పిచికారి చేయిస్తున్నామని ఈ తూడు ఎండిన తర్వాత ఆ తొక్కు తొలగిస్తే డ్రైను సంపూర్ణంగా రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని కావున వెంటనే అధికారులు కూడా ఈ విషయంపై శ్రద్ధ వహించవలసిందిగా ఆయన కోరారు.

# మే10న జాతీయ లోక్ అదాలత్

**– జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ శ్రీమతి. గంధం సునీత , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి వివిధ భీమా సంస్థల ప్రతినిధులు మరియు ఆ సంస్థల న్యాయవాదులతో సమావేశమయ్యారు. మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నందు అధిక మొత్తంలో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు తగు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ మేరకు పెండింగ్ లో ఉన్న మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో భీమా సంస్థల వారు, యాక్సిడెంట్ కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొవాలని అన్నారు. ఈ సమావేశంలో గవర్నమెంట్ ప్లీడర్ సి. హెచ్. వి. ప్రసాద్ , ఆయా సంస్థల న్యాయవాదులు, చిట్ ఫండ్ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కంచి విశ్వవిద్యాలయంలో అడ్మిషన్లకు ఆహ్వానం

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కంచి కామకోటి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యా లయంలో ఈ విద్యా సంవత్సరం 2025–26 ప్రవేశానికి విద్యార్థుల నుండి అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నారని వేద పండితులు ఆకళ్ళ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిశ్వవిద్యాలయంలో యూజీ, పిజీ మరియు బిఈ విభాగాలలో అనేక కోర్సులను నిర్వహిస్తున్నారని దానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని వివరించారు. బిఈలో ఫుల్ టైం సిఎస్సి,సివిల్,ఈఈఈ, మెకానికల్ అనేక కోర్సులను నిర్వహిస్తున్నారని అదే విధంగా బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, సైబర్ సెక్యూరిటీ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ ఇలా అనేక కోర్సులు ఉన్నాయని మురళీకృష్ణ వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ డేటా సైన్స్, ఎలక్ట్రికల్ వెహికల్స్, రోబోటిక్స్ ఇలా అనేక అధునాతన కోర్సులు కూడా యూనివర్సిటీ నిర్వహిస్తున్నారు అని వివరించారు. ఎక్సెంట్



ప్లేస్మెంట్ ఫెసిలిటీ కూడా ఉందని తెలిపారు. గృహ వాతావరణం కల్పించే విధంగా హాస్టల్ వసతి సదుపాయాలు ఉన్నాయని, సంస్కృతము, ఇండియన్ కల్చర్ మరియు ఆయుర్వేద విభాగాలలో ఉన్నత విద్య బోధన కూడా ఉందన్నారు. బిఈ, బీటెక్, ఎంఇ, బిఈ, బిబిఏ, ఎంబిఏ, బిసిఎ, ఎంసిఏ, బిఎస్‌సి, ఎంఎస్‌సి, ఎంకామ్, బీకాం, ఎంఏ కోర్సులలో విద్యార్థుల నుండి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు.

గత31సం వత్సరాలుగా విశ్వవిద్యాల యాన్ని అద్భుతంగా నిర్వహిస్తున్నారని, దేశ విదేశాలలో పేరుందని, 21 సంస్థలతో అవగాహన ఒప్పందా లను కూడా చేసుకున్నారని, ఉత్తమ ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో స్వామీజీ స్వీయ పర్యవేక్షణలో కంచి నగరంలో నిర్వహిస్తున్న అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా మురళీకృష్ణ వివరించారు. ఇతర వివరాలకు 96290 32323, 96290 1144 లో సంప్రదించవచ్చని కోరారు. అంతర్జాతీయ పరిజ్ఞానం కలిగిన ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా బోధన నిర్వహించబడుతుందని అన్నారు.

# పచ్చిధాన్యాలను అమ్ముకుని రైతులు నష్టపోవద్దు

**– కొనుగోలు సిబ్బంది అందుబాటులో ఉన్నారు**
**– వ్యవసాయ శాఖ అధికారులు**



**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** పచ్చిధాన్యాలను అమ్ముకుని రైతులు నష్టపోవద్దని వ్యవసాయ శాఖ అధికారులు పత్రికా ప్రకటన ద్వారా కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. ఎమ్ విజయ కుమార్, పాడా డైరెక్టర్ చైత్రవర్షిణి, పిఠాపురం వ్యవసాయశాఖ అధికారిణి పి.స్వాతి పిఠాపురం మండలంలోని కుమారపురం, ఎఫ్‌కె పాలెం గ్రామములకు చెందిన రైతుల వరి కళ్లములను సందర్శించారు. ప్రస్తుతం జరుగుచున్న ధాన్యం కొనుగోళ్ల విషయమై అడిగి తెలుసు కున్నారు. గ్రేడ్ ఏ రకం రూ. 1740/– కామన్ రకం రూ.1725/– కు ప్రభుత్వం కొనుగోలు చేయుచున్నప్పుడు పచ్చి ధాన్యాలను తక్కువ ధరకు అమ్ముకొని రైతులు నష్టపోవద్దని కోరారు. కొనుగోలు సిబ్బంది జాయిన్ అవ్వడంలో కొద్దిగా ఆలస్య మైనప్పటికీ... ప్రస్తుతం సిబ్బంది అందరూ అందుబాటులో ఉన్నారని, గోనె సంచులు కూడా అందుబాటులో ఉంచామని, అందువలన రైతులు ఏవిధమైన ఆందోళ నకు గురై తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోవవద్దన్నారు. కొనుగోళ్ల విషయమై రైస్ మిల్లర్‌ల నుండి ఏమైనా ఇబ్బందులు ఎదురైనా వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావలసినదిగా వ్యవసాయ సహాయకులు, కొనుగోళ్ల సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. ఈకార్యక్ర మంలో పిఠాపురం మండల వ్యవసాయ అధికారి అచ్యుతరావు, ఇతర వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌లను గ్రామస్థాయి ఉద్యోగులుగా గుర్తించాలి



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను గ్రామస్థాయి ఉద్యోగులుగా గుర్తించాలంటూ ఎంపీడీవో ఏ.రాజుకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 19 ఏళ్లుగా గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను గ్రామపంచాయతీ సిబ్బందిగా క్రమబద్ధీకరించాలన్నారు. మండలం యూనిట్ గా తీసుకుని అంతర్గత బదిలీలు చేపట్టడం ద్వారా స్థానిక ఒత్తిడి లను అధిగమించి మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు వీలు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్ టి ఈ ఇచ్చి పూర్తిస్థాయి హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్ కార్డు, ప్రమాద బీమా, గ్రాడ్యుటి వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వడంతో పాటు, 10 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు.

2016–19 సంవత్సరాల మధ్య కాలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉద్యోగులకు జీతాలు పెరిగాయని, ఫీల్ అసిస్టెంట్లకు మాత్రం పెరగలేదని వారు వాపోయారు. మాకు కూడా అదే స్థాయిలో జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా అర్హతల ఆధారంగా కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్గా పదోన్నతి కల్పించాలని వారు కోరారు. పై డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశామని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# హైవే రహదారి విస్తరణలో కనుమరు గైన క్రైస్తవ సమాధి రాహదారి మార్గం

**– గ్రామ సర్పంచ్ చొరవతో తాత్కాలిక రహ దారి ఏర్పాటు**



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** ఎన్‌హెచ్ 516ఈ జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా రాజవొమ్మంగి గ్రామశివారు క్రైస్తవ స్మశానవాటికకు రహదారి సమస్య ఏర్పడడంతో గురువారం గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి ఆధ్వర్యంలో నాయకుల చొరవతో జెసిపితో తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయడం జరిగింది. రాజవొమ్మంగి గ్రామంలోని క్రైస్తవ సమాజానికి చెందిన స్మశానవాటిక (సమాధుల ప్రాంగణం)కు వెళ్లే ప్రధానరహదారి గతఏడాదికాలంగా జరుగుతున్న నేషనల్ హైవే విస్తరణ , డ్రైనేజ్ నిర్మాణ పనుల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. అంత్యక్రియలుతో పాటుగుడ్ ఫ్రైడే,ఈస్టర్ వంటి పవిత్ర క్రైస్తవ పండుగలు నిర్వహించడానికి తీవ్ర అవరోధం ఏర్పడే పరిస్థితి నెలకొంది. సమస్యను గుర్తించిన స్థానిక క్రైస్తవ నాయకులు బుంగ రాజ్ కుమార్ గ్రామసర్పంచ్ గొల్లపూడి రమణి, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు,మండల టీడీపీసీనియర్ నాయకులు దంతులూరి శివరామచంద్రరాజు (శివాజి) దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. తక్షణమే స్పందించిన సర్పంచ్ రమణి, గొల్లపూడి పెద్ద రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలికి రహదారి ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి చెందినక్రైస్తవులు గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలు చేసుకునే అవకాశం ఏర్పడిందనిహర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనతండ్రి బుంగ రాజారావు మాస్టారు, తన సోదరుడు బుంగ రాజబాబుల జ్ఞాపకార్థంగా ఈ ప్రాంగణ అభివృద్ధికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి స్మశాన వాటికకు చుట్టూప్రహరీ గోడ, త్రాగునీటి సదుపాయం కోసం బోరు, పాడుబడిన కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం కొరకు నిధులు మంజూరుకు తను వంతు కృషి చేయడం జరుగుతుందని టిడిపి అధ్యక్షులు పెద్దరాజు హామీ ఇచ్చినట్లు రాజ్ కుమార్ తెలిపారు. సామాజిక భాధ్యతతో,కులమతాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న గొల్లపూడిపెద్దిరాజు,సర్పంచ్ రమణి, సీనియర్ నాయకులు శివాజి, ఇతర నాయకులకు రాజ్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ఫైర్ స్టేషన్ నందు అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం ఎడిఎఫ్ఓ ఎన్.శ్రీహరి జగన్నాథ్ సూచనల మేరకు ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో గౌతమ్ స్కూల్ నందు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. దీనిలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించి, అగ్నిమాపక సిబ్బంది సేవల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలోఫైర్ సిబ్బంది పి.ఆర్. ఆర్.ప్రసాద్, ఎన్.గీతాప్రసాద్, ఎండి.యాకూబ్, వై.వీరబాబు, ఎల్.సుధాకరరావు, కె.మురళీకృష్ణ, ఎం.సురేష్, జి.చిరంజీవి, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఎస్‌సి కార్పోరేషన్ రుణాలకు నోటిఫికేషన్



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఎస్.సి. కార్పోరేషన్ ద్వారా రుణాలు సైట్ ఆన్‌లైన్ ప్రారంభమైందని, గురువారం నుంచి మే 10వ తేది వరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చునని, మున్సిపల్ కమీషనర్ కె.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ లబ్దిదారుడు ఎస్.సి. సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలని, కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని, లబ్దిదారుడు ఆంధ్రప్రదేశ్‌కి చెంది ఉండాలని, లబ్దిదారుల వయోపరిమితికి 21 నుండి 50 ఏళ్ళు లోపు ఉండాలని, బిపిఎల్ కేటగిరికి చెంది ఉండాలని, స్వయం ఉపాధి పథకాల రవాణా పథకానికి లబ్దిదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లబ్దిదారులు జనరిక్ ఫార్మసి పథకాలకు డి.ఫార్మసి / బి.ఫార్మసి / ఎం.ఫార్మసి సర్టిఫికెట్ ఉండాలని, ఆధార్ కార్డ్ లింక్ అయిన ఫోన్ నెంబర్, రేషన్ కార్డ్, కుల మరియు ఆదాయ ధృవీకరణ పత్రం, ఎస్‌సి కార్పోరేషన్ ఓబిఎంఎంఎస్ పథకం క్రింద ఆన్‌లైన్ ప్రారంభించినందున మే10 వరకు పై అర్హతలు కలిగిన ధరఖాస్తుదారులు ధరఖాస్తు చేసుకోవలసినదిగా కమీషనర్ తెలిపారు.

# భజన కళాకారుల కుటుంబ సభ్యులకు పరామర్శించిన

## – అధ్యక్ష, సంఘ సభ్యులు







**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లాల శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు యడవిల్లి సూర్యచక్రం, ఉపాధ్యక్షులు ఇనుగంటి రామకృష్ణ, గౌరవాధ్యక్షులు పోతుల వీరన్న చౌదరి, మామిరెడ్డి నెహ్రూ, ఎలిశెట్టి కామరాజు, కవిశేఖర్ నీలం శ్రీను, కోశాధికారి పంచాది రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు, డైరెక్టర్లు చవిటిపల్లి త్రిమూర్తులుల ఆధ్వర్యంలో బుధవారం ఇటీవల తూర్పుపాకలు గ్రామానికి చెందిన ఉలవకాయల బుజ్జి తండ్రి లోవరాజు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను, కిర్లంపూడి మండలం, తామరాడ గ్రామానికి చెందిన గుర్రం అప్పన్న దొర తండ్రి రాము ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను, పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి చెందిన అక్కిశెట్టి నాగబాబు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను, గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామానికి చెందిన డా.పి.ఎస్.రామకృష్ణ తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సామాజిక సేవలో మజ్జిగ పంపిణీ..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** సామాజిక సేవలో భాగంగా గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టామని ప్రముఖ వైద్యులు విజయబాబు అన్నారు. గురువారం ఏలేశ్వరం మార్కెట్ ఎదురుగా గల ప్రధాని రహదారిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విజయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాజీ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల నుంచి గురువారం సంతకు వచ్చేవారికి ప్రతి గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కరోడ్ సత్యనారాయణ, రౌతు సహదేవుడు, గోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రాంతాల అభివృద్ధి చేయాల్సిందే

**– రైతులకు పూర్తిగా న్యాయం చెయ్యాలి**

**– పర్యావరణ ప్రజాభిసేకరణ సదస్సులో ఓఎన్జీసీ సంస్థను డిమాండ్ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు**



**ఆలమూరు,మేజర్‌న్యూస్ :** ఓఎన్జీసీ సంస్థ ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధిని చేసుకోవడం మా హక్కు అయిన అభివృద్ధిని చేసి తీరాలని ఆలమూరు మండలం పెదపల్ల గ్రామం ఓఎన్జీసీ జిసిఎస్టేషన్ వద్ద ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. అలాగే 8110 కోట్ల రూపాయల ప్రాజెక్టుకు సంబంధించి ఓఎన్జీసీ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడానికి చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలను సేకరించి వాటిని పరిశీలించాలన్నారు. సంస్థ కార్యకలాపాల విలువను బట్టి స్థానిక ప్రాంతాల అభివృద్ధికి ఇవ్వాల్సిన వాటా హక్కును ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధి కోసం కోరిన మేరకు నిధులను మంజూరు చేయాలని కోరారు.

అలాగే సంస్థ కార్యకలాపాలు ప్రారంభించడానికి రైతుల నుండి భూములు లీజుకు తీసుకుంటున్నారని పని పూర్తయ్యాక రైతులను సంస్థ పట్టించుకోవడం లేదన్నారు. మరలా ఆ భూములు రైతులకు ఉపయోగకరంగా ఉండటం లేదని దాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు పూర్తి న్యాయం చేయాలని ఓఎన్జీసీ అధికారులను కోరారు. గ్రామాల్లో రోడ్ల,వంతెనల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గంలో అభివృద్ధిపనులకు 84.96 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని ఓఎన్జీసీ అధికారులకు ఎమ్మెల్యే సత్యానందరావు వినతి పత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యానికి "ధర"లేక..





**- ధాన్యానికి ధర లేక దిగాలుగా రైతన్న- రైతు భరోసా కేంద్రాల్లో దక్కని భరోసా**

**బస్తాకు సుమారు రూ.500/-నష్టపోతున్నామంటున్న రైతులు - ప్రభుత్వం తమను ఆదుకోవాలని కౌలు రైతుల వినతి**

**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** తాను పండించిన పంటకు (ధాన్యానికి) సరైన గిట్టుబాటు "ధర"లేక రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలనివేడుకుంటున్నాడు.గతంలో బస్తాకు రూ.1800/- వరకు ధర మరియు రవాణా ఖర్చులు, సొసైటీ ద్వారా రూ.90/- రూపాయల వరకు బోనస్ దక్కేదని, నేడు అదే బస్తాకు రూ.1200/- కూడా పలకడం లేదని, చెప్పిన ధరకే అమ్ముకున్నా... నెలలు తరబడి డబ్బులు చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిధిలో గల రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించినా... తమకు భరోసా లభించడం లేదని రైతులు చెబుతున్నారు.
ధాన్యానికి ధర లేకపోవడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని, సాధన,అంకురపూజ,ఓం సాయి, పద్మ వంటి సన్నవీడు రకంధాన్యాన్ని పండించామని, ఈ రకానికి గతంకంటే భిన్నంగా నేడురూ.1200/- ధరదక్కడమేకష్టంగా మారిందని, ఒక బస్తాకు సంచి బరువు, తేమ, పచ్చిదనంవంటి కారణాలతో మూడుకేజీల వరకు అదనంగా పోతుందని, ఇంతవరకు అధికారులు ఎవరూ తమను పట్టించుకున్న పాపాన పోలేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ధాన్యానికి ధర లేదు..** ధాన్యానికి సరైన ధరలేక తాము తీవ్రంగా నష్టపోతున్నాము. గతంలో రూ.1900/- వరకు పలికిన ధర నేడు రూ.1200/-దాటిపలకడం లేదు.వచ్చిన ధరకే ధాన్యాన్ని అమ్ముకున్నా... డబ్బులు చెల్లించే విషయంలో కూడా తీవ్రజాప్యం జరుగుతుంది. ధాన్యానికిసరైనధరకల్పించి ప్రభుత్వంఆదుకోవాలని కోరుకుంటున్నాము.



**ఇనుకొండ సాయిబాబు (రైతు)**
**(పిఠాపురం మండలం)( భోగాపురం గ్రామం )**

**ధర లేక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నాం...**



కౌలుకు తీసుకుని, అప్పులు చేసి రాత్రిపగళ్ళు కష్టపడి పనిచేసి పంటను పండిస్తే... పంట అమ్ముకునే సమయానికి సరైన ధరలేకుండా పోయింది.బస్తాకు సుమారు రూ.500/-వరకు నష్టపోతున్నాం. మద్దతుధర కల్పించి ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరుకుంటున్నాం. ఇంతవరకు అధికారులు ఎవరూ తమను సంప్రదించలేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతాం.

**అనంత దుర్గ ( కౌలు రైతు)**
**(భోగాపురం గ్రామం)(పిఠాపురం మండలం)**

**తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోవద్దు :**



పచ్చి ధాన్యాలను తక్కువ ధరకు అమ్ముకొని రైతులు నష్టపోవద్దు. కొనుగోలు సిబ్బంది జాయిన్ అవ్వడంలో కొద్దిగా ఆలస్య మైనప్పటికీ ప్రస్తుతం సిబ్బంది అందరూ అందుబాటులో ఉన్నారు.గోనె సంచులుకూడా అందుబాటులో ఉన్నాయి. అందువలన రైతులు ఏవిధమైన ఆందోళనకు గురైతక్కువధరకు దళారులకు అమ్ముకొని నష్టపోవవద్దు. కొనుగోళ్ల విషయమై రైస్‌మిల్లర్‌ల నుండి ఏమైనా ఇబ్బందులు ఎదురైనావెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలి.

**చైత్ర వర్షిణి (పాడా డైరెక్టర్ )**

# సిహెచ్ఓ హక్కులను పరిరక్షించాలి

**- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద శాంతియుత నిరసన**

**- రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్**

**ఆలమూరు, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ మందిరాల్లో వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ)ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద గురువారం సిహెచ్‌ఓలు శాంతియుత నిరసనను తెలియ జేశారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలాంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఉన్నత విద్యను అభ్యసించి చాలీ చాలని వేతనాలతో జీవనం గడుపుతూ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిహెచ్‌ఓలు అనుభవిస్తున్న కడుపు కోతను, మానసిక వేదనను గుర్తించి తమ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద తమ నిరసనలను తెలుపుతూ ఆందోళన చేపట్టామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 10031మంది, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 432 మంది ఆయుష్మాన్ భారత్ మందిరాల్లో వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు.



ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం సిహెచ్‌ఓలను సత్వరమే రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని, గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 23 శాతం జీవన భృతి కల్పించాలని, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయ బద్ధమైన డిమాండ్లపై ప్రభుత్వం సత్వరం స్పందించకుంటే భవిష్యత్‌లో తమ ఆందోళనను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్‌కు అందజేశారు.

# జి.రాగంపేట సర్పంచ్ చెక్ పవర్ రద్దు

**- రూ.16,44,900/- దుర్వినియోగం**

**- డిఎల్‌పిఓ ఎం.బాలామణి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, జి.రాగంపేట మేజర్ పంచాయితీ సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు చెక్‌పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి వై.రవికుమార్ ఉత్తర్వులు ఇచ్చినట్లు పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారిణి ఎం.బాలామణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ గ్రామంలో జూలై 13, 2022 నుంచి, అక్టోబర్ 10, 2024 వరకు సాధారణ నిధులు రూ.24,40,143/-లలో రూ.10,70,988/-, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.21,39,821/-లో రూ.5,73,912/- లు నిబంధనలకు విరుద్దంగా వ్యయం చేసి, దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలిందని ఆమె తెలిపారు. వ్యయం చేసిన పనులకు సంబంధించి సరైన ఎంబుక్‌లు, ఓచర్లు, ఇతర పత్రాలు, రికార్డులు సవ్యంగా లేకపోవడంతో విచారణ చేసి, నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా డిపిఓ రవికుమార్ సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుపరుస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, అలాగే డిఎల్‌పిఓకు చెక్ వవర్ ఇస్తూ ఉత్తర్వులలో పేర్కొన్నట్లు ఆమె తెలిపారు. దుర్వినియోగం చేసిన రూ.16,44,900/- లను సర్పంచ్ నుంచి రాబట్టవలసినదిగా ఉత్తర్వులలో పేర్కొన్నారన్నారు. అప్పట్లో పంచాయతీ గ్రామ కార్యదర్శిగా పనిచేసి, ప్రస్తుతం కిర్లంపూడి మండలం, జగపతినగరం గ్రామ సెక్రటరీగా పనిచేసిన ఎన్.టి.ఆర్.రమేష్‌బాబు ప్రస్తుత కార్యదర్శి సూర్యనారాయణరెడ్డికి రికార్డులు అప్పగించనందున శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎల్‌పిఓ బాలామణి తెలిపారు.

# దాట్ల సాహిత్య కృషి ప్రశంసనీయం ...



**కాజులూరు,మేజర్‌న్యూస్ :** స్థానిక ఎస్.డి.వి.ఆర్.ఆర్.ఏ.ఉన్నత పాఠశాల కొలంకలో రాష్ట్ర ప్రభుత్వంచే 'కళారత్న' పురస్కారం స్వీకరించిన ప్రసిద్ధ కవి,కథకుడు దాట్ల దేవదానం రాజును పాలక వర్గం, గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ దంతులూరి అనంత వర్మ అధ్యక్షతన ఈ కార్యక్రమము ఘనంగా జరిగింది.కోలంక గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పాఠశాల పూర్వ విద్యార్థి అయిన దాట్ల దేవదానం రాజు ప్రతిష్టాత్మక అవార్డు పొందినందుకు గర్వపడుతున్నామని తెలియజేశారు. డా.ఎస్ ఆర్ కే ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ డా. వరుగు భాస్కరరెడ్డి మాట్లాడుతూ రాజు వెలయించిన సాహిత్యం గురించి విపులంగా వివరించారు. కథ, కవిత్వం, చరిత్ర, యాత్రా కథనం వంటి వివిధ ప్రక్రియల్లో అద్భుతంగా రచనలు చేయడం ప్రశంసనీయమన్నారు. రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు తాతపూడి ప్రసాదరావు పురస్కారం పొందిన రాజు ప్రతిభ కొనియాడదగినదని అభినందించారు.

ఆంధ్రీకుటేరం సంచాలకులు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అవార్డుగ్రహీత అధ్యయనశీలత, పట్టుదల, కృషిస్ఫూర్తి దాయకమని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి రంగారావు సమన్వయకర్తగా వ్యవహరించారు.సభలో వీరభద్రరాజు, సోమశంకరశర్మ రామభద్రరాజు, కొండ్రాజు,చిట్టిబాబు, సత్యనారాయణ పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని దేవదానం రాజుకు అభినందనలు తెలిపారు.

# జెఎన్టీయుకెలో ఘనంగా యుసిఇకె వార్షికోత్సవ వేడుకలు






**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో గురువారం సాయంత్రం అలూమ్ని ఆడిటోరియం నందు యుసిఇకె వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్‌సగిలి షాన్‌మోహన్‌విచ్చేయగాఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్ ప్రొ.కెవి.రమణ,ఓఎస్‌డిప్రొ.డి.కోటేశ్వరరావులు వేదికనలంకరించారు.యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా యుసిఇకె వైస్‌ప్రిన్సిపాల్స్ ప్రొ.ఎం.స్వరూపారాణి, ప్రొ.జి.వి.ఎస్.ఆర్.దీక్షితులు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ మాట్లాడుతూ కాలేజీలో విద్యనభ్యసించడం ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకమన్నారు. ఒక మంచి కళాశాలలో చదివినపుడు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉన్నతమైన ఆలోచనలు జీవితాన్నిమారుస్తాయని,ఆలోచనల్లో ధైర్యంనింపి ముందడుగు వేస్తే దేనినైనా సులభంగా సాధించవచ్చునన్నారు.మంచి నడవడికతో విద్యార్థులు చిన్న తనం నుండే విద్యపై మక్కువ చూపించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను మరియు అకడమిక్ అవార్డులు, ఎండోమెంట్ అవార్డులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె. ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక జీవితంలోని సామాజిక మరియు సాంకేతిక మార్పులను అధిగమించినపుడే విద్యార్థులు సునాయాసంగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించి మంచి నడవడిక అలవర్చుకునేలా తీర్చిదిద్దాలన్నారు. వార్షిక దినోత్సవం అనేది కళాశాల యొక్క ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని, ఈ రోజున కళాశాలలో జరిగిన విజయ క్షణాలను ఆనందంతో నిర్వహించుకుంటా మన్నారు. విద్యను కేవలం మార్కులతోనే సరిపెట్టకూడదని, విద్య ద్వారా మన నడవడికను, నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించి కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు.ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు కళాశాలవార్షిక నివేదికను, కోర్సుల వివరాలు,విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్స్ తదితర వివరాలను తెలియజేశారు. తదుపరి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్‌లను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆహుతులను అలరింపజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రథమ స్థానం సాధించిన ఇంటర్ విద్యార్థినికి సత్కారం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జ్యోతుల సాయిజ్యోతిని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 983 మార్కులు సాధించి కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి స్థానం సాధించిన సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సాయిజ్యోతిని సత్కరించి రూ.పది వేల చెక్కును అందజేశారు. ఇదే పట్టుదలతో ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థానానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సాయి జ్యోతికి సూచించారు. సాయిజ్యోతి చదువుకోవడానికి చక్కటి ప్రోత్సాహన్ని అందించిన తల్లిదండ్రులను, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నితిపూడి గోవిందు, తల్లిదండ్రులు సత్తిబాబు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బర్డ్ ఫీడర్స్ పంపిణీ కార్యక్రమం





### - లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసికి అభినందనలు తెలిపిన పలువురు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పర్యావణ సమతుల్యతకు జీవివైవిద్యం ఎంతో అవసరం అని అదిశగా ఒక కార్యక్రమాన్ని రూపొందించి గత 4 సంవత్సరాలుగా బర్డ్ ఫీడర్స్‌ను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసీ అభినందనీయులు అని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇ.వి.వి. ఈశ్వర్‌కుమార్ పేర్కొన్నారు.

కాకినాడ వివేకానంద పార్కు వద్ద లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బర్డ్ ఫీడర్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి లయన్ క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసీ అధ్యక్షత వహించగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇ.వి.వి.ఈశ్వర్కుమార్ ముఖ్యఅతిథిగాను పాస్ట్ గవర్నర్ డా. బాదం బాలకృష్ణ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ రీజియన్లో గల 26 లయన్స్ క్లబ్స్ ప్రెసిడెంట్ సెక్రటరీ, ట్రెజరర్లకు అందజేసారు. ఈసందర్భంగా గవర్నర్ ఇ.వి.వి. ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు జీవివైవిద్యానికి ఎంతో అవసరం అని అదిశగా ఒక కార్యక్రమాన్ని రూపొందించి గత 4 సంవత్సరాలుగా ప్రతి ఏటా బర్డ్ ఫీడర్న్లు పంపిణీ చేస్తున్న పద్మతులసీ అభినందనీయురాలు అని పేర్కొన్నారు. పాస్ట్ గవర్నర్ డా.బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్విరాన్మెంట్ కార్యక్రమాన్ని తాను నిర్వహిస్తున్న ఇతరులతో కూడా చేయించేందుకు ప్రతిఏటా బర్డ్ ఫీడర్స్‌ను పంపిణీ చేస్తున్న రీజనల్ చైర్మన్ పద్మతులసీని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుని ఇటువంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 చిట్నిడి శ్రీనివాస్, నాగమణి దంపతులు, జోన్ చైర్మన్ డా.గరికిపర్తి నమఃశివాయ, కటకం శ్రీనివాస్, ఉమా, సామా రత్నమాల, షర్మిళ, మోహన్ కుమార్, పులవర్తి కుమార్, మధురవాణి, ఇంద్రకంటి శ్రీనివాస్ నాగేశ్వరి, పెద్ద సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు చెప్పకుండా అభివృద్ధి పనులు చేస్తే ఊరుకోం!



**రంపచోడవరం,మేజర్‌న్యూస్:** మండలంలో ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు, పనులు చేపట్టకూడదని మండల సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. రంపచోడవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము ఎంపీపీ బంధం శ్రీదేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుండం శ్రీనివాసు దొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎం.పి.టి.సి సభ్యులు, జడ్.పి.టి.సి సభ్యురాలు పండా వెంకట లక్ష్మీ, సర్పంచులు, మండలం పరిధిలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎం.ఎల్.సి అనంత ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేయడం జరిగింది. ముఖ్యంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పనులు సమాచారం ఎం.పి.టి.సి, సర్పంచులకు తెలియజేయకపోతే ఊరుకునేది లేదని పలువురు పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయితీలు, మండల పరిషత్ తీర్మానాలు లేకుండా ఏవిధమైన పనులు చేయకూడదని అన్నారు. ఆ విధంగా చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఎం.పి.టి.సిలు, జడ్.పి.టి.సి, సర్పం చులు, మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, పంచాయితీ విస్తరణాధికారి కె.అర్.యు.ఎల్ పద్మజ పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన వసతులు

### - చర్యలు చేపట్టిన వాడపల్లి దేవస్థానం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లిస్వామివారి ఆలయానికి విచ్చేసే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థపతి డిప్యూటీ కమిషనర్ పి.పరమేశప్ప, డిఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్‌రావుతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ప్రతి శనివారం ఆలయంలోకి వచ్చేందుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న దృశ్య ప్రవేశ ద్వారాలను వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. అలాగే కోనేరు నిర్మాణం పార్కింగ్ లో జరుగుతున్న మరుగుదొడ్ల అభివృద్ధి పనులు కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణాలు పూర్తి కావడంతో భక్తులకు చాలావరకు ఇబ్బందులు తప్పేవన్నారు. గతంలో పులిహోర ప్రసాదం అమ్మకాలు లేకపోవడంతో భక్తులు నిరుత్సాహం వ్యక్తం చేసేవారని దీంతోవారి సూచనలు పరిగణంలోకి తీసుకుని పులిహోర అమ్మకాలు చేపట్టామన్నారు. అమ్మకాలకు మంచి ఆదరణ లభిస్తుంది అన్నారు. వసతి గదులు నిర్మాణానికి కూడా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

# జెఎన్టీయుకెలో ఘనంగా యుసిఇకె క్రీడా దినోత్సవ వేడుకలు










**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో గురువారం ఉదయం అలూమ్ని ఆడిటోరియం నందు యుసిఇకె క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్‌విచ్చేయగా, గౌరవ అతిథిగా హైదరాబాద్‌లోని కస్టమ్స్&సెంట్రల్ ట్యాక్స్ జిఎస్‌టి విభాగం ఇన్‌స్పెక్టర్, భారత బీచ్ వాలీబాల్ టీమ్ కెప్టెన్&అంతర్జాతీయ వాలీబాల్, బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ఎం.సిహెచ్.ఆర్.కృష్ణంరాజు హాజరు కాగా, ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్,ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావులు వేదికనలంకరిం చారు. యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ.ఎం.స్వరూపారాణి, ప్రొ.జివిఎస్ఆర్.దీక్షితులు, యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్ కుమార్‌లు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ మాట్లాడుతూ వృత్తిరీత్యా, ఆరోగ్యరీత్యా మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందేందుకు క్రీడలు దోహదపడతాయని, క్రీడల ద్వారా మన జీవిత గమనం మారుతుందన్నారు. క్రీడలు, సంగీతం నేర్చుకున్నట్లయితే మన నడవడిక, వైఖరి సానుకూల ధోరణి వైపు మారుతుందని విద్యార్థులకు సూచించారు. మనం ఏ పని చేస్తున్నామో దాన్ని ఏకాగ్రతతో చేస్తే ఓటమి చవిచూసినా ప్రయత్నిస్తూ ఉంటే విజయం దానంతట అదే వస్తుందని, దానికి గొప్ప ఉదాహరణ క్రీడలేనన్నారు. విద్యలో రాణించాలనుకునే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనట్లయితే ఇంకా బాగా రాణించగలరన్నారు. జీవితంలో ఎదగడానికి చదువే కాకుండా ఆటపాటలను కూడా భాగంగా చేసుకోవాలని సూచించారు. అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకొనేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. భారత బీచ్ వాలీబాల్ టీమ్ కెప్టెన్ ఎం.సిహెచ్.ఆర్.కృష్ణంరాజుమాట్లాడుతూ జెఎన్‌టియుకె యూనివర్శిటీకి ఒక మంచి గుర్తింపు ఉందని, క్రీడలలో పాల్గొనే విద్యార్థులకు క్రెడిట్ పాయింట్స్ ఇస్తున్న యూనివర్శిటీ జెఎన్‌టియుకె ఒక్కటేనన్నారు. క్రీడల్లో పాల్గొనేవారికి క్రెడిట్ పాయింట్స్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని, ఈ విధానాన్ని మిగిలిన అన్ని యూనివర్శిటీలు అవలంభించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినవారు స్పోర్ట్స్ కోటాలో 3శాతం రిజర్వేషన్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం చాలా సులభమన్నారు. ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ఒక వ్యక్తి యొక్క నడవడికను మెరుగుపర్చేందుకు, ప్రతిభను అన్వేషించేందుకు క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మానసిక, శారీరక ధృడత్వాన్ని పెంపొందించేందుకు, ఆరోగ్యకరంగా ఉండేందుకు క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల ద్వారా పట్టుదల, కార్యసిద్ధి మెరుగుపడి ఒత్తిడిని జయించవచ్చునన్నారు.

ముందుగా యూనివర్శిటీ స్పోర్ట్స్‌కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్‌కుమార్ 2024-2025 విద్యాసంవత్సరంలో క్రీడలకు సంబంధించిన వార్షిక నివేదికను సభాముఖంగాతెలియజేశారు. అనంతరం జెఎన్‌టియుకె యూనివర్శిటీ తరపున జాతీయస్థాయిపోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు, విజేతలకు,వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, సిబ్బందికి అతిథులు సర్టిఫికెట్‌లను, మెమెంటోలు, బహుమతులను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. క్రీడా దినోత్సవ వేడుకలను విజయ వంతంగా నిర్వహించినందుకు గాను స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్ కుమార్ మరియు వ్యాయామ అధ్యాపకులకు, సిబ్బందికి యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావుఅభినందనలు తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చాగల్లు మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృత తనిఖీలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు, ఆరోగ్య సేవలు అందించడంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిబద్ధత కలిగి విధులను బాధ్యతలని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి చాగల్లు మండలంలో ఉనగట్ల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం తనిఖీ అనంతరం, బ్రాహ్మణ గూడెం గ్రామంలో రీ సర్వే తీరు, గ్రామ సచివాలయం సందర్శన చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ద్వారా గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వొచ్చే రోగుల సంఖ్య, వారి వివరాలు నమోదు చేసే రికార్డుల్ని పరిశీలించి తగిన సూచనలను చెయ్యడం జరిగింది. ఆసుపత్రిలో వైద్య సేవలు అందించే క్రమంలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. మందుల పంపిణీ, వాటికి సంబంధించిన రికార్డుల్ని పరిశీలించి, ఇండెంట్ ప్రకారం నమోదు వివరాలు తెలుసుకున్నారు.

**- క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియ పరిశీలన..** అనంతరం బ్రాహ్మణ గూడెం గ్రామంలో రీసర్వే పనులని పరిశీలించి, రైతులతో మాట్లాడడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. రీసర్వే కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పాల్గొనే సమయంలో యజమానులు రైతులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. ఎటువంటి అభ్యంతరాలు అన్న తెలియజేస్తే వాటిని సరి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్వేకి సంబంధించి సంబంధించి గతంలో చేపట్టిన సర్వేపై అభ్యంతరాలు నేపథ్యంలో రిసర్వే చేపట్టడం జరుగుతోందన్నారు.

**-సచివాలయ సిబ్బంది పనితీరుపై సమీక్ష:** ప్రజలకు సేవలు అందించే క్రమంలో మన మిత్రా యాప్ 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని రావడం జరిగిందనీ, ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, తద్వారా ప్రస్తుతం 161 పౌర సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో చేపడుతున్న వివిధ రీ సర్వే డేటా వివరాలు తెలుసుకోవడం జరిగింది. సచివాలయం పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరి మొబైల్‌లో మన మిత్రా యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానంలో చురుగ్గా వ్యవహరించాలని తెలిపారు. కొత్తగా 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్స్ వివరాలు సర్వే కూడా చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీ నారాయణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా పి.కోమల,తహసిల్దార్ ఎమ్‌మేరికమ్మ, జిల్లా సర్వైవల్ అధికారి డా టి.రాజీవ్ , తహసిల్దార్ ఎమ్ఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీవారి చక్రస్నానం, పుష్పయాగం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలోని నారాయణ గిరిపై శ్రీ ద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు చివరిరోజు చక్రస్నానం, శ్రీ పుష్పయాగం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు ద్వారకా తిరుమల చైర్మన్ ఎస్.వి.సుధాకర్, ఈఓ ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి ఆదేశాలు మేరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయని ఆలయ అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావు తెలిపారు.

సాయి మందిరంలో పిఓ దంపతులచే అన్నదానం

రంపచోడవరం శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులకు వారే స్వయంగా వడ్డించారు. ఈ అన్నదానం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ అన్నదానానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అనంతబాబు డోర్ డెలివరీ కేసులో.. న్యాయవిచారణ !

**- ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ళ నియామకం**

**- జీవో జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**



రంపచోడవరం,మేజర్‌న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయం విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్‌కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538ని విడుదల చేసింది. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని అత్యంత దారుణంగా హత్యచేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమ తిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంతబాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంతబాబు బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా స్వచ్ఛమైన ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంతబాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు అందరిలోనూ కలుగుతోంది.